క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే పొన్నాడ


టిల్లకుప్ప–అమలాపురం బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: తీరప్రాంత గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రమైన అమలాపురం వెళ్లేందుకు వీలుగా టిల్లకుప్ప–అమలాపురం ఆర్టీసీ బస్సు నూతన సర్వీసును స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల ఆదరణను బట్టి బస్సు సర్వీసులను పెంచుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, కడియం తమ్మయ్య, ఢిల్లీ నారాయణ, మోకా రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ శ్రీధర్‌ను కలిసిన లారీ ఓనర్స్ ప్రతినిధులు


జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు పూలమొక్కను అందిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సుసర్ల శ్రీధర్‌ను లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఎస్పీని కలిసినవారిలో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు, అమలాపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా శ్రీరాములు, కార్యదర్శి కురసా వెంకట్రావు తదితరులున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం టౌన్: అమలాపురంలోని షాదీఖానా భవనం పైఅంతస్తులో ఉన్న గదులను ఎలాంటి నిబంధనలు పాటించకుండా తొలగించారని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్, డైరెక్టర్లు ఎండీ రబ్బాని, ఎండీ అలీషా, కర్రార్ హుస్సేన్‌లు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు శనివారం ఫిర్యాదు చేశారు. షాదీఖానా అధ్యక్షుడు షెహన్‌షా జిల్లా వక్ఫ్ బోర్డు దృష్టికి పైఅంతస్తు గదులు తొలగిస్తున్నట్లు తీసుకురాలేదని కలెక్టర్‌కు వివరించామని బోర్డు జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

పంటకోత దిగుబడి ప్రయోగం

ఐ.పోలవరం: మండలపరిధిలోని మురమళ్లలో రైతు ఉప్పు సుబ్బారావు పంట పొలంలో పంట కోత దిగుబడి ప్రయోగం ఏపీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆయేషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎకరానికి 50 బస్తాల చొప్పున రబీ సీజన్‌లో దిగుబడి వచ్చిందని అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి ఎం.వాణి, ఏఎస్ఓ శ్రీనివాసరావు, దునీషా పాల్గొన్నారు.

ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం


విరాళాన్ని ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ శాశ్వత అన్నదాన ట్రస్ట్‌కు పట్టణంలోని మహిపాలవీధికి చెందిన దివంగత బండారు సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు రూ.10 వేల విరాళం సమకూర్చారు. ఈ మొత్తం చెక్‌ను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి ఆలయంలో దాతలు శనివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాపు నాడు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్, బండారు రామమోహనరావు, దూడల ఫణి, అబ్బిరెడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


మహిళచే సీపీఆర్ చేయిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ రాజేంద్ర సరోజ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ప్రకృతి విపత్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది తుఫాన్లు, అగ్ని ప్రమాదాలు ఎలా వ్యవహరించాలో వివరించారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి ఊపిరి అందించే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ కుంచే చిట్టికుమారి, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాటకాలకు ప్రాణం పోసి


శ్రీనివాస కల్యాణం నాటక ప్రదర్శన


అందమైన జీవితం నాటక ప్రదర్శన

- కనకాలపేట కళాకారుల చెరగని ముద్ర
- నాటకం కనుమరుగు కాకుండా కృషి

యానాం: బలహీనతలని బలహీనపరిచి గుణాత్మకమైన బలాన్ని ఇచ్చేది నాటకం. ఒకప్పుడు నాటకానిది, పల్లె ప్రజలది విడదీయలేని బంధం. కాలక్రమేణా సినిమా, టెలివిజన్, ఇంటర్నెట్ వేదికలు నాటకాల స్థానాన్ని లాగేసుకున్నాయి. అవి ఇంటింటా చొరబడి నాటకాలు కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి. అయినా సరే తెలుగు నాటకాలకు ఊపిరిలూదేందుకు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు యానాం కనకాలపేటకు చెందిన కళాకారులు.. నేడు తెలుగు నాటకరంగ దినోత్సవంగా సందర్భంగా రంగస్థలంపై తమదైన ముద్ర వేసిన కనకాలపేట కళాకారుల కృషి గురించి 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

సుమారు వెయ్యి సంవత్సరాలకు పైగా ప్రాచీన చరిత్ర కలిగిన తెలుగు భాష ఈనాటికి ప్రజల మధ్య నిలబడటానికి ప్రధాన కారణం పద్య నాటకమంటే ఆశ్చర్యం కలగక మానదు. పూర్వం పద్య నాటకాలు చూడటం వల్ల పామరుడు కూడా పండితుడయ్యాడు. గ్రామీణ ప్రాంతాల్లో నాటక రంగానికి ఉండే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. కేవలం రంగస్థలంపైనే ఆధారపడి జీవించిన కళాకారులు కోకొల్లలు. కాని సినిమాలు, టెలివిజన్, సీరియల్స్ ప్రభావంతో నాటకరంగం తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది.

1979 నుంచి క్రమం తప్పకుండా..

యానాం కనకాలపేటకు చెందిన నాటక రంగ కళాకారులు 1979లో శ్రీనివాసా నాట్య కళామండలిని స్థాపించారు. అప్పటి నుంచి పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలన్న తేడా లేకుండా తెలుగు నాటకం ఎక్కడ వేసినా ఈ గ్రామం నుంచి కళాకారులు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చి వచ్చేవారు. పూల రంగడు, మంచిరోజులు, గాలివాన, పల్లెపడుచు, పాతరోజులు, అమ్మో ఆడపిల్ల తదితర ఎన్నో అద్భుత నాటకాలు ప్రదర్శించారు. తరతరాలుగా నాటక రంగాన్ని వదిలిపెట్టకుండా రంగస్థలంపై తమదైన ముద్ర వేస్తున్నారు. ప్రస్తుతం మూడో తరం యువకులు ఇతరత్రా ఏ వృత్తుల్లో ఉన్నా సరే ఇదో ప్రవృత్తిగా భావించి తెలుగు నాటకం కనుమరుగు కాకుండా ఉండేందుకు సాంఘిక, పౌరాణిక నాటకాలను వేస్తున్నారు. కేవలం గత ఆరేడేళ్ల కాలంలోనే దాదాపు 30 వరకూ సాంఘిక నాటకాలు ప్రదర్శించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కోన అప్పారావు మాస్టారు, జక్కపు సత్తిబాబు, తోట భైరవస్వామి, కోన వెంకట సుబ్రహ్మణ్యం, హంసాని రామలక్ష్మణుడు, యాళ్ల లక్ష్మణరావు, కోన దేవ, జక్కపు భైరవస్వామి, గొల్లెల వీరబాబు, మల్లిపూడి సత్తిబాబు, కొమ్మిరెడ్డి భద్రి తదితర సుమారు 40 మంది కళాకారులు కనకాలపేట గ్రామంలో ఉండటం విశేషం.

2018లో కాకినాడ యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్‌లో జరిగిన నంది నాటక దినోత్సవాల్లో కనకాలపేట కళాకారుల నాటకాలను ప్రదర్శించారు. షిరిడీ సాయి మహత్యం వివిధ గ్రామాల్లో 60 సార్లు ప్రదర్శించారు.

కనుమరుగు కానివ్వకూడదనే..



ఒక నాటకం ప్రదర్శించడానికి కళాకారులు, టెక్నీషియన్లకు ఇవ్వడానికే రూ.50 వేలు ఖర్చవుతుంది. ఎక్కువ మంది సీరియళ్లకు వెళ్లిపోతుండడంతో మహిళా ఆర్టిస్టులు దొరకడం లేదు. డ్యాన్స్ బేబీలు, ఆర్కెస్ట్రాలకు తప్ప నాటకరంగాన్ని పోషించే పోషకులు లేకుండా పోయారు. అయినా తెలుగు నాటకం కనుమరుగు కానివ్వకూడదని వ్యయప్రయాసలకోర్చి నాటకాలు వేస్తున్నాం.

– జక్కపు సత్తిబాబు, సీనియర్ నాటక కళాకారుడు, కనకాలపేట

నాటకాలను ప్రోత్సహించాలి



ఒక నాటకం ప్రదర్శించాలంటే తెర వెనుక ఎంతో కష్టం దాగి ఉంటుంది. నాటకం ఎంపిక, రిహార్సల్స్, మేకప్, కళాకారుల ఎంపికతో పాటు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులుంటున్నాయి. వీటన్నింటిని అధిగమించి నాటకాలు ప్రదర్శిస్తున్నాం. తెలుగు నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– కోన అప్పారావు మాస్టారు, నాటక కళాకారుడు, కనకాలపేట

జగనన్నే మా భవిష్యత్తు


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు


జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బులినాని

తాళ్లరేవు: సంక్షేమ పథకాల అమలుతో అందరి మనసులను గెలుచుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనే ప్రజలందరి నమ్మకమని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. శనివారం నీలపల్లి పంచాయతీలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లను అతికించారు. కార్యక్రమంలో రెడ్డి సతీష్, కట్టా దుర్గారావు, ర్యాలి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం

అమలాపురం టౌన్: పట్టణంలోని 24వ వార్డులో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, పట్టణ సచివాలయాల, గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణకుమార్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటి గుమ్మాలకు మా నమ్మకం నువ్వే జగన్ నినాదాలతో ఉన్న స్టిక్కర్లను అతికించారు.

జగనన్నే మాభవిష్యత్‌కు విశేష స్పందన

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోకి వెళుతుంటే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారన్నారు. ఈ నెల 23తో ప్రజా సర్వే ముగుస్తోందన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రజల్లో తమ పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలకు చెమటలు పడుతున్నాయన్నారు. సమావేశంలో కుడా చైర్మన్ చంద్రకళా దీప్తి, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది


ముమ్మిడివరంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్ని మాపక కేంద్రం అధికారి కేవీ మురళి కొండబాబు ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం పట్టణంలోని పలు కూడళ్లలో సిబ్బంది అవగాహన కల్పించారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్, గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటర్లలో అగ్ని ప్రమాదాల సిబ్బంది స్పందించే తీరును ప్రజలకు ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. అగ్నిమాపక శకటం, దాని నుంచి వచ్చే నీరును గొట్టాలతో వెదజల్లే విధానాలను చేసి చూపించారు. లీడ్ ఫైర్‌మెన్ బలరామ్, సిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ముమ్మిడివరం అగ్ని మాపక కేంద్రం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బల్లగేటు సెంటర్, ఆర్టీసీ బస్‌స్టాండ్, కొండాలమ్మ చింత, కొత్తలంక గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్.గంగన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణా తరగతులు


మట్టి నమూనా సేకరణపై సూచనలిస్తున్న డీడీఏ జ్యోతిర్మయి

తాళ్లరేవు: రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి శనివారం మట్టి నమూనాల సేకరణకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ భూసారాన్ని బట్టి ఎరువులు వాడుకోవడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. నేల రకాలు, నేల స్వభావం, సమస్యాత్మక భూముల నిర్వహణపై ప్రశాంతి అవగాహన కల్పించారు.

కాట్రేనికోన: వ్యవసాయ సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు భూసార పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతిర్మయి సూచించారు. కాట్రేనికోనలో భూపరిరక్షణ–మట్టి సేకరణపై వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సిబ్బందికి శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్ష కార్డు ఉపయోగాలు, కార్డును బట్టి ఎరువులు వాడకంపై అవగాహన కల్పించారు.

అమలాపురం రూరల్: మండలంలోని చిందాడగరువు రైతు భరోసా కేంద్రం వద్ద మండల స్థాయి భూసార పరిరక్షణ మట్టి నమూనాలు సేకరణపై మండల వ్యవసాయాధికారి కడలి ధర్మ ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఆలోచన విధానమే జీవితాన్ని నిర్దేశిస్తుంది

అమలాపురం టౌన్: మన ఆలోచనా విధానమే మన జీవితాన్ని నిర్దేశిస్తుందని రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబులోని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి ప్రధాన కేంద్రం వ్యక్తిత్వ వికాస నిపుణురాలు గీతా బెహెన్జీ అన్నారు. స్థానిక రవణం వీధిలోని బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ రిట్రీట్ సెంటరులో జరుగుతున్న యోగ భట్టీ శిక్షణా తరగతులకు హాజరైన ఆమె సానుకూల, ప్రతికూల ఆలోచనలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మోటివేషన్ స్పీకర్ రాజయోగి సూరజ్ బాయ్, స్థానిక కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రక్షిత మంచి నీరు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కాట్రేనికోనలో గడపగడపకూ మన ప్రభుత్వం


రేవువారిపేటలో మహిళకు మంచినీటి బిందెను అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: గుక్కెడు నీటి చుక్కలకు ఎదురుచూసిన ముమ్మిడివరం నియోజకవర్గ శివారు గ్రామాల ప్రజలకు జలజీవన్ మిషన్, సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన రక్షిత మంచి నీటి ప్రాజెక్టులు దాహార్తి తీరుస్తున్నాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. శనివారం కాట్రేనికోన మార్కెట్ ప్రాంతం, ప్రధాన రహదారుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రేవువారిపేట, జిల్లేళ్లవారిపేట, చెంచుల గరువుల్లో నిర్మించిన మంచి నీటి ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు విషం కక్కుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ముమ్మిడివరం టీడీపీ ఐటీ వింగ్ నుంచి మాదే అజయ్ అనే సోషల్ మీడియా కార్యకర్త శనివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాడు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాల మునికుమారి, కాట్రేనికోన సర్పంచి గంటి వెంకట సుధాకర్, మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, జగడం బాలయ్య, మల్లీశ్వరరావు, పాలెపు ధర్మారావు, రంబాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగరపంచాయతీ శివారు పల్లిపాలెంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, ఆలయ వార్షికోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వాడపల్లి సుదర్శనం జనార్దనాచార్యులు, కొండవీటి రాంబాబు స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు చేశారు. కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కుడా చైర్మన్ చంద్రకళా దీప్తి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా గంగాభవానీ, హితకారిణి చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి తదితరులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విగ్రహం ఏర్పాటుతో వివాదం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామ పరిధిలో వీఎస్ఆర్ కాలనీ ప్రధాన పంట కాలువ చెంత గురువారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయడం వివాదాస్పదంగా మారింది. విగ్రహం ఏర్పాటుపై మరో సామాజికవర్గ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. తాలూకా ఎస్ఐ అందే పరదేశి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రభుత్వ అనుమతులు లేవంటూ పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు శుక్రవారం రాత్రి జేసీబీ సాయంతో ఆ విగ్రహాన్ని తొలగించారు. దీంతో అన్యాయంగా అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించారంటూ దళిత ప్రజాసంఘాల నాయకులు జంగా బాబురావు, డీబీ లోక్, రేవు తిరుపతిరావు తదితరుల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. విగ్రహాన్ని తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేసి కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాలు అందజేశారు. అనుమతులు లేకపోవడం వల్లే విగ్రహాన్ని తొలగించినట్లు ఎస్ఐ పరదేశి తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర


వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉండ్రు సుదర్శనరావు అధ్యక్షతన అల్లవరం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకూ 750 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని తెలిపారు. రబీలో సగటున 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, సభ్యులు కొపనాతి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి


మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ఎస్.ప్రశాంతి

తాళ్లరేవు: రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పి.మల్లవరం, కోరంగి పంచాయతీలలోని శివారు భూములకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, కిసాన్ డ్రోన్లు, అపరాల సాగు, పీఎం కిసాన్ ఈకేవైసీ, రైతు భరోసా పథకాల గురించి వ్యవసాయాధికారిణి ఎస్.ప్రశాంతి వివరించారు. పశు సంవర్ధక శాఖ కార్యక్రమాలను వెటర్నరీ వైద్యులు దవులూరి సుధ తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె.చంద్రశేఖర్, ఆర్ఐ సాయితేజ, రాయుడు గంగాధర్ రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ అందజేత

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని దరియాలతిప్పలో కొన్ని రోజులుగా జరుగుతున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు కన్నీడి నాగార్జున, నవీన్, జగడం ధర్మారావు, అలెక్స్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్ ఇఫ్తార్ విందు


యానాం మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్

యానాం: పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. శనివారం స్థానిక చారిత్రక జామియా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అశోక్ పాల్గొన్నారు. యానాం నియోజకవర్గంలో మైనారిటీలైన ముస్లింలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి యువతకు ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇమామ్ ఎండీ ఎల్తాన్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్‌మహ్మద్ తాజుద్దీన్‌భాషా, కరీమ్, జిలానీ, రిజ్వాన్, సుభానీ, బిస్మిల్లా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం వద్ద అన్నదానం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రధాన రహదారిలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 48వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. తాళ్లరేవు, పోలేకుర్రు, పి.మల్లవరం, కోరంగి, సీతారామపురం, గాడిమొగ తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

పంపింగ్ స్కీంకు మరమ్మతులు

యానాం: ధవళేశ్వరం–యానాం పంపింగ్ స్కీంకు ఏర్పడిన లోపాలను సరిదిద్దడానికి మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ధవళేశ్వరం నుంచి యానాం వరకూ సుమారు 64 కిలోమీటర్ల మేర తాగునీటి పైపులైను వేసినా కొన్నేళ్లుగా నీరు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో పంపింగ్ స్కీం వద్ద పనులు చేపట్టడానికి పూడికను తొలగించడానికి ఇప్పటికే పుదుచ్చేరి చీఫ్ ఇంజినీరుతో మాట్లాడామన్నారు. పంపింగ్ స్కీం ప్రారంభమైతే మూడు క్యూసెక్కుల చొప్పున నీటిని తరలించడానికి మార్గం సుగమమవుతుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

యానాం: నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం కురసాంపేట వాటర్‌ట్యాంక్ సమీపంలో నూతనంగా నెలకొల్పిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. కురసాంపేట పరిసర ప్రాంతాల్లో లోఓల్టేజీతో సమస్యను గతంలో స్థానికులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరతగతిన రూ.5 లక్షలు విలువ చేసే 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నెలకొల్పేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పనుల ప్రణాళికపై గ్రామసభ

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం గ్రామసభ నిర్వహించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకిమూడి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం, చెరువుల అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


తాళ్లరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తాళ్లరేవు: మండలంలో పదో తరగతి పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలోని ఆరు కేంద్రాల్లో 1095 మంది విద్యార్థులకు గాను 1082 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, మరో 13 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారి ఎ.మంగాయమ్మ తెలిపారు.

అల్లవరం: అల్లవరం–1, 2, కొమరగిరిపట్నం, దేవగుప్తం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ కిరణ్‌బాబు శనివారం తెలిపారు. నాలుగు కేంద్రాల్లో కలిపి 655 మందికి గాను 640 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, 15 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పేదలకు అన్నదానం

అమలాపురం టౌన్: అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలో అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. రోడ్ల చెంత ఉండే యాచకులు, అనాథల వద్దకు వెళ్లి ఆహార పొట్లాలను అందజేశారు. దాదాపు వంద మందికి ఆహార పొట్లాలు అందించారు.

తుక్కేశ్వరరావుకు నివాళులు

అమలాపురం రూరల్: ఎంపీఆర్‌పీఎస్ నేత ఈతకోట తుక్కేశ్వరరావు మరణం తీరని లోటని బాబూ జగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం సభ్యులన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబులు తుక్కేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉందుర్తి సతీష్, ఆకుమర్తి శ్రీనివాసరావు, సుదర్శనరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.